క్లుప్తంగా

30న జాబ్‌మేళా



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కాటసాని ఓబులరెడ్డి

బనగానపల్లె : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 30న బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్లేస్‌మెంట్ అధికారి సుబ్బన్న తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు వైఎస్సార్‌సీపీ నాయకుడు కాటసాని ఓబులరెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాటసాని ఓబులరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నిరుద్యోగ యువత కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుదర్శన్‌రెడ్డి, కటివానికుంట మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆధార్ ప్రత్యేక క్యాంప్

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల, గిద్దలూరు సచివాలయాల్లో శనివారం ఆధార్ ప్రత్యేక క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగకుమార్ తెలిపారు. ప్రత్యేక క్యాంప్‌లో కొత్త ఆధార్ నమోదు, మార్పులు, చేర్పులు సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఒక్కరోజు జరిగే ప్రత్యేక క్యాంప్‌ను సచివాలయ పరిధిలోని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చౌడేశ్వరి ఆలయాభివృద్ధికి విరాళం



నగదు అందజేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ ఓబులేసు

కోవెలకుంట్ల: మండలంలోని బిజనవేములలో వెలసిన చౌడేశ్వరీదేవి ఆలయ అభివృద్ధికి గ్రామానికి చెందిన పోలీస్ బ్రదర్స్ శుక్రవారం విరాళం అందజేశారు. గ్రామానికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ ఓబులేసు పోలీస్‌శాఖలోనే విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురు సోదరులు గతంలో ఆలయ జీర్ణోద్ధరణకు రూ. 1.29 లక్షలు విరాళం ఇచ్చారు. వారి తండ్రి వర్ధంతిని పురస్కరించుకుని ఆలయాభివృద్ధికి మరో రూ. 21వేలు అందజేశారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : జగదుర్తి సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ లైన్ పనులు జరుగుతున్న నేపథ్యంలో శని,ఆదివారాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ కింద ఉన్న జగదుర్తి, ఉడుములపాడు, గుంటుపల్లె, సోంపురం, తాటిమానుకొత్తూరు, అమకదాడు గ్రామాలకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 7గంటల వరకు కరెంటు సరఫరా నిలిపి వేస్తామన్నారు. వ్యవసాయానికి తెల్లవారు జామున 5 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తామని చెప్పారు. వినియోగదారులు విద్యుత్‌శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

అన్నదానం గొప్పది

బేతంచెర్ల: అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని ఉర్దూ అకాడమీ సభ్యులు ముర్తుజావలి, స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఖాజా హుసేన్, వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకులు బాబుల్ రెడ్డి అన్నారు. శుక్రవారం సిమెంట్ నగర్ గ్రామంలోని మాబు సుభానీ దర్గా దగ్గర మా బాషా, ఖాదర్ వలీ, వన్నూర్ సాహెబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిత్యాన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. అనంతరం ముఖ్య అతిథులను నిర్వాహకులు సత్కరించారు.

డ్రైవర్‌కు గాయాలు

డోన్ టౌన్ : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన 108 వాహన డ్రైవర్ కృష్ణయ్య శుక్రవారం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. సాయంత్రం విధులకు హాజరు అయ్యేందుకు స్వగ్రామం కృష్ణగిరి మండలం కటారుకొండ నుంచి బైకుపై వస్తుండగా పట్టణంలోని చిగురమానుపేట సమీపంలో అడ్డుగావచ్చిన కుక్కను తప్పించబోయి కిందపడ్డాడు. గాయపడిన కృష్ణయ్యను స్థానికులు డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారుల

సంజామల: బనగానపల్లె మండలం నందవరం ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన నియోజకవర్గస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో సంజామల మండలం నొస్సం, పేరుసోముల పాఠశాలల విద్యార్థులు ప్రతిభచాటి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నొస్సం పాఠశాల విద్యార్థులు వి.నాగసోని, హరిచౌడయ్య, శివచరణ్, ఎస్ రాజేష్,పి గాయత్రి,జి వైష్ణవి,జి వెంకటేశ్వరి, పేరుసోముల పాఠశాలకు చెందిన వర్ధిని జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆయా పాఠశాలల వ్యాయమ ఉపాధ్యాయులు ప్రతాప్, చంద్ర తెలిపారు.



కోవెలకుంట్లలో గణేష్ నిమజ్జన ఊరేగింపులో యువకుల కోలాహలం



వినాయక విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న దృశ్యం



బనగానపల్లెలో చిన్నారుల కోలాటం

వినాయకా... సెలవిక!

- ఘనంగా గణనాథుల నిమజ్జనం
- విగ్రహాల ఊరేగింపులో యువకుల కోలాహలం
- మారుమోగిన జై గణేష్ మహరాజ్ నినాదం
- రూ. 50 పలికిన గాంధీనగర్ గణపయ్య లడ్డూ
- ఆకట్టుకున్న సాంస్కృతి కార్యక్రమాలు



కోవెలకుంట్ల పట్టణంలో బొజ్జ గణపయ్య విగ్రహాలను ఊరేగింపుగా నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తజనం

కోవెలకుంట్ల: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కోవెలకుంట్ల, బనగానపల్లె పట్టణాల్లో గణేష్ నిమజ్జనం ఘనంగా జరిగింది. కోవెలకుంట్ల పట్టణంలోని గాంధీనగర్, రంగరాజుపేట, కుమ్మరివీధి,సంతపేట, నాగులకట్ట, గడ్డవీధి, సాయినగర్, ఇందిరానగర్ తదితర ప్రధాన కూడళ్లతోపాటు 45 ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో కొలువుదీరిన గణనాథులకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వినాయకుల వద్ద ఉంచిన లడ్డూ ప్రసాదాలను దక్కించుకునేందుకు వేలంపాటలో భక్తులు పోటీ పడ్డారు. ప్రత్యేకించి గాంధీనగర్‌లో కొలువుంచిన బొజ్జగణపయ్య లడ్డూ ఏకంగా రూ. 50 వేలు పలికింది. అనంతరం పురవీధుల గుండా వినాయక విగ్రహాల ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. గ్రామపంచాయతీ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్, ముదిగేడు చౌరస్తా, పాండురంగ స్వామి దేవాలయం, సంతపేట, గాంధీసెంటర్, అంకాలమ్మ చౌరస్తామీదుగా అశేష భక్తజనుల మధ్య ఊరేగింపు అంగరం వైభవంగా సాగింది.అనంతరం పట్టణ శివారులోని కుందూనదిలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఊరేగింపులో యువకుల నృత్యాలు,డీజే, డ్రమ్స్ వాయిద్యాలు మిన్నంటాయి.రంగులు చల్లుకుంటూ యువకులు కేరింతలు కొట్టారు. జై గణేషా నినాదం మారుమోగింది. వినాయకా... ఇక సెలవు అంటూ వేడుకుంటూ గణనాథులను భక్తిశ్రద్ధల తో నిమజ్జనం చేశారు. సీఐ నారాయణరెడ్డి, ఎస్‌ఐలు వెంకటరెడ్డి,మౌలానీ నిమజ్జనోత్సవాలను పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో గణపయ్య నిమజ్జనం

సంజామల: వినయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రం సంజామలలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో కొలువుదీరిన వినాయక విగ్రహాలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ముందుగా స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించి నిమజ్జనానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. కళాకారుల చెక్కభజన తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తులు రంగులు చల్లుకుంటూ గణపతి బప్పా మోరియా,గణేష్ మహారాజ్‌కి జై అంటూ నినాదాలు చేశారు. అనంతరం సంజామల సమీపంలోని పాలేరువాగులో వినాయకుల విగ్రహాలను నిమజ్జనం చేశారు.



బనగానపల్లె మండలం, కైప చెరువులో గణనాథుడి నిమజ్జనం

అంగరంగవైభవంగా గణనాథుల నిమజ్జనం



'కాంతార' వేషధారణలో కళాకారులు

బనగానపల్లెరూరల్ : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా బనగానపల్లె పట్టణంలో శుక్రవారం గణనాథులు నిమజ్జనం అంగరంగ వైభవంగా జరిగింది. పెండేకంటి నగర్, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఇంటి సమీపంలో, బోయపేట కాలనీ, సబ్ స్టేషన్ ఏరియా, బీసీ కాలనీ, పంచమపేట, హరిజనపేట, కరీంబాగ్ కాలనీ, నాయీబ్రహ్మణ కాలనీ, యాదవపేట, తెలుగుపేట, మంగళవారంపేట, అర్బన్ కాలనీ, కూరగాయాల మార్కెట్ తదితర కాలనీల్లో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపాల్లో కొలువుదీరిన గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. మధ్యాహ్నం నుంచి ప్రారంభమైన గణనాథుల గ్రామోత్సవం అంరంగవైభవంగా సాగింది. చిన్నా, పెద్ద తేడాలు లేకుండా రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు. యువకులు కేరింతలు కొట్టారు. గణేష్ మారాజ్‌కు జై నినాదాలు ఆకాశాన్నంటాయి. చిన్నారుల కోలాటం, మహిళలు ఉట్టికొట్టు కార్యక్రమం ఆకట్టుకుంది. కాంతార వేషధారణలో కళాకారులు మెప్పించారు. బొజ్జగణపయ్య విగ్రహాల ఊరిగింపు డ్రమ్స్ వాయిద్యాలు, యువత కేరింతలు, కళాకారుల నృత్యాల మధ్య కోలాహలంగా కైప గ్రామం చెరువుకు చేరింది. జయజ్యోతి సిమెంట్ పరిశ్రమ సహకారంతో ఏర్పాటు చేసిన క్రేన్‌తో వినాయక విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేసి బై..బై చెప్పారు భక్తజనం. సీఐ తిమ్మారెడ్డి, బనగానపల్లె, నందివర్గం ఎస్‌ఐలు రామిరెడ్డి, వీరాంజనేయులు, రామాంజనేయరెడ్డి బందోబస్తు పర్యవేక్షించారు.



బనగానపల్లె పట్టణంలో నిమజ్జనం తరలుతున్న గణనాథులు



ప్రధాన వీధిలో గణపయ్య విగ్రహాల ఊరేగింపు దృశ్యం



సంజామలలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు

వైఎస్సార్ బీమాతో ధీమా



బాధిత కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ బీమా పథకం ద్వారా బాధిత కుటుంబాలకు ధీమా లభిస్తుందని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఉమ్మాయిపల్లె తండాలో ఇటీవల మూడె చందునాయక్ ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా పైకప్పు కూలిన ప్రమాదంలో మృతి చెందాడు. ఈ మేరకు శుక్రవారం కొలిమిగుండ్లలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5లక్షల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు జెడ్పీ చైర్మన్ అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ప్రమాదం జరిగిన వెంటనే సచివాలయ సిబ్బంది వివరాలన్నీ నమోదు చేయడంతో రెండు నెలల్లోనే బీమా మంజూరైందన్నారు. కుటుంబాన్ని పోషించే వ్యక్తి హఠాత్తుగా సహజ, లేదా ప్రమాదవశాత్తు మరణిస్తే కుటుంబ సభ్యులకు ఆర్థిక భరోసా ఇచ్చేందుకు ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకాన్ని అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఉమ్మాయిపల్లె తండా, తోళ్లమడుగు సర్పంచ్‌లు లక్ష్మిదేవి, మొలక రాజారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి,పంచాయితీ కార్యదర్శులు మహేష్,రవి తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు పరిశీలన



పంట నమోదు ను పరిశీలిస్తున్న ఏఓ అబ్దుల్‌షఫీ

డోన్ రూరల్ : మండల పరిధిలోని చిన్నమల్కాపురం , పెద్ద మల్కాపురం, కమలాపురం గ్రామాలలో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ఏఓ అబ్దుల్ షఫీ పరిశీలించారు. సాగు చేసిన ప్రతి పంటను నమోదు చేయించుకోవాలని ఈ సందర్భంగా ఏఓ రైతులకు సూచించారు. ఏ పంట నమోదు అయ్యిందనే విషయాన్ని రైతులు సరిచూసుకోవాలని, మార్పులు, చేర్పులు ఉంటే ఈనెల 30లోపు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఝాన్సీ, నాగసులోచన, లత తదితరులు పాల్గొన్నారు.

వర్షం... హర్షం!

- కోవెలకుంట్లలో 52 మి.మీ వర్షం
- జలమయమైన ప్రధాన వీధులు
- పైర్లకు ప్రాణం
- రబీ ప్రారంభానికి ముందే అనుకూలంగా వర్షాలు
- అన్నదాత ఆనందం



గుంజలపాడు సమీపంలో వర్షపునీటితో చెరువును తలపిస్తున్న పొలం





అమడాల సమీపంలో చిక్కుడు పంటలో చేరిన వర్షపునీరు,సొదరదిన్నె సమీపంలో మిరప పంటలో ..

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లో పలు మండలాల్లో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. కోవెలకుంట్ల మండలంలో అత్యధికంగా 52 మి.మీ, సంజామల-34.6 మి.మీ, అవుకు - 32.4 మి.మీ, కొలిమిగుండ్ల - 24.2 మి.మీ, దొర్నిపాడు - 30.2 మి.మీ, ఉయ్యాలవాడ మండలంలో 8.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆయా మండలాల వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. కోవెలకుంట్ల పట్టణంలోని అమ్మవారిశాల, బీసీ హాస్టల్, అయ్యప్పస్వామివీధి, ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ జలమయం అయ్యాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన మిరప, జొన్న, మినుము, కంది, పెసర, ఆముదం, ఉల్లి, పొద్దుతిరుగుడు తదితర పంటలకు భారీ వర్షం ఊరటనిచ్చింది. చెరువులను తలపించేలా పొలాల్లో వర్షపునీరు చేరింది. అక్టోబర్ నుంచి రబీ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో వారం రోజుల ముందే భారీ వర్షం కురియడంతో కలిసొచ్చిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రబీలో సబ్ డివిజన్‌లోని ఆయా మండలాల్లో పప్పుశనగ, జొన్న, మినుము, మొక్కజొన్న తదితర పంటలు సాగు కానున్నాయి.

సద్దలవెంగన్న చెరువుకు జలకళ

కొలిమిగుండ్ల: ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షం కురవడంతో గురువారం రాత్రి భారీ వర్షం కురువడంతో కొలిమిగుండ్ల-నాయినపల్లె గ్రామాల మధ్యనున్న సద్దలవెంగన్న చెరువుకు భారీగా వరద చేరింది. దీంతో చెరువుకు జలకళ సంతరించుకుంది. కొలిమిగుండ్లలో 24.4 మి.మీ వర్షపాతం నమోదైంది. అవుకు, ప్యాపిలి మండలాల్లోని ఎగువ ప్రాంతాల్లో కుండపోత వర్షం కురవడంతో వరద నీరు చేరి వెంగన్న చెరువు అలుగు పారింది. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి చెరువు వద్దకు చేరుకొని గంగమ్మకు పూజలు నిర్వహించారు. వర్షం తక్కువగా కురిసినా చెరువు నిండిందన్న విషయం తెలుసుకున్న రైతులు ఆసక్తిగా చెరువు వద్దకు చేరుకున్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన కంది,జొన్న తదితర పంటలకు ఉపశమనం లభించిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్ ఆరోగ్యశ్రీని సద్వినియోగం చేసుకోండి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

డోన్ టౌన్ : పేద ప్రజల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ ఆసుపత్రి సూపరిడెంట్ డాక్టర్ మహ్మద్ హనీఫ్ సూచించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం ఆరోగ్యశ్రీ పథకం కింద నంద్యాలకు చెందిన ఉదయానంద కార్కినోస్ క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత హెల్త్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ప్రముఖ అంకాలజిస్ట్ డాక్టర్ నాగసుదర్శన్‌రెడ్డి, జనరల్ సర్జన్ డాక్టర్ సాయిప్రణీత్‌రెడ్డి దాదాపు 40 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ మేరకు 10 మందికి ఇతర పరీక్షలు చేసేందుకు సిఫారసు చేశామని డాక్టర్లు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ జిల్లా కో ఓఆర్డినేటర్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

- ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి

డోన్ రూరల్ : అర్హులైన ప్రతి ఒక్కరి సొంతింటి కల నెరవేర్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే అని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మండల కార్యాలయంలో శుక్రవారం హౌసింగ్ డీఈ నాగభూషణంరెడ్డితో కలిసి ఎంపీపీ గృహ నిర్మాణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో సొంత స్థలం కలిగి ఉండి ఇళ్లు నిర్మించుకోవడానికి 947 మందిని గుర్తించామన్నారు. వీరు ఇంటి స్థలానికి సంబంధించిన సర్వే నంబర్, హద్దులను ఇంజినీరింగ్ సహాయకులకు అందజేస్తే గృహాలు మంజూరు చేస్తామన్నారు. ఇంకా ఎవరైనా జాబితాలలో పేర్లు లేక అర్హత ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత మేరకు గృహాలు మంజూ చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో హౌసింగ్ డీఈ నాగభూషణంరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు



ప్రతిభ చాటిన విద్యార్థులతో ప్రిన్సిపాల్

కొలిమిగుండ్ల: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన క్రీడా పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటి జిల్లా,రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ చంద్రసేనారెడ్డి శుక్రవారం తెలిపారు. రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఇంటర్ విద్యార్థులు రవిరాజు, హ్యాండ్‌బాల్‌కు దస్తగిరి,ఉదయ్ ఎంపికైనట్లు చెప్పారు. జిల్లా స్థాయిలో అండర్-17 విభాగంలో హ్యాండ్ బాల్ పోటీలకు శ్రీకాంత్, కార్తీక్, త్రోబాల్‌కు జీవిత, కబడ్డీకి నరసింహ సెలెక్ట్ అయ్యారు. అలాగే అండర్-14 విభాగంలో వాలీబాల్ పోటీలకు శ్రీశాంత్‌రెడ్డి, శంకర్, అబ్దుల్లా ఎంపికయ్యారని చెప్పారు. విద్యార్థులతోపాటు పీడీ గంగాదేవిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

కానాల, ముక్కమల్లలో ఆధార్ ప్రత్యేక క్యాంపులు

సంజామల: మండల పరిధిలోని కానాల, ముక్కమల్ల గ్రామాలలోని సచివాలయాల్లో శుక్రవారం ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు నిర్వహించారు. కొత్త ఆధార్ నమోదుతోపాటు మార్పులు, చేర్పులు తదితర సేవలు డిజిటల్ అసిస్టెంట్స్ బాలాజి,రాజా అందజేశారు. 28 మంది ఆధార్ సేవలు పొందారని వారు తెలిపారు.

క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి



పరుగు పందెంలో పాల్గొన్న క్రీడాకారులు

బేతంచెర్ల: క్రీడాకారులుగెలుపు ఓటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని ఆర్డీఓ వెంకటరెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, ఉర్దూ అకాడమీ సభ్యులు ముర్తుజావలి సూచించారు. పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం ఎంఈఓ సోమశేఖర్, హెచ్‌ఎం అబ్రహ్మం ఆధ్వర్యంలో నిర్వహించిన డోన్ డివిజన్ స్థాయి స్కూలు గేమ్స్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన వారు విద్యార్థుల క్రీడా వందనం స్వీకరించారు. అనంతరం కబడ్డీ, కోకో, వాలీబాల్, బ్యాడ్మింటన్, త్రోబాల్, అథ్లెటిక్, యోగా పోటీలు జరిగాయి. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంగన్న, తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీ కృష్ణ, మద్దిలేటి స్వామి చైర్మన్ రామచంద్రుడు, సింగిల్ విండో చైర్మన్ నారాయణ, నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ రంగస్వామి వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్‌రెడ్డి,గూని నాగరాజు, తిరుమలేశ్వర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, వ్యాయమ ఉపాధ్యాయులు రంగనాయకులు, రఘునాథ్‌రెడ్డి, ఉపాధ్యాయులు హరి కృష్ణ పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యమే లక్ష్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ బుగ్గన

బేతంచెర్ల: పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందజేయడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీలో ఆయుష్మాన్ భవః, సామాజిక ఆరోగ్య కేంద్రం వారానికోసారి నిర్వహించే ఆరోగ్య మేళా కార్యక్రమాన్ని వైద్యులు సాగరిక, చరన్ రాజు ఆధ్వర్యంలో వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక ఆరోగ్య సేవల్లో భాగంగా గర్భిణి, ప్రసవ, చిన్న పిల్లలు, శస్త్ర చికిత్స, చెవి, ముక్కు, గొంతు తదితర విభాగాల వైద్య నిపుణులు ఆరోగ్య మేళా కార్యక్రమంలో అందుబాటులో ఉంటారని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.